క్లుప్తంగా

ప్రారంభమైన ఖోఖో పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా సాధనతో చక్కని ఆరోగ్యమేకాకుండా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో తెలుస్తుందని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి రోశయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ ఈఎం స్కూల్లో ఆంధ్ర, తెలంగాణ స్థాయి అండర్-14, 17, 19 ఖోఖో పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పోటీలో విజయాలు సాధించడకంటే పోటీల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలన్నారు. విజయం సాధించే ముందు పొందే ఓటములే ఉన్నత జీవితానికి పునాదులన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడలవైపు ప్రోత్సహించాలని కోరారు. బిషప్ మాట్లాడుతూ ఈ పోటీలు 3 రోజుపాటు కొనసాగుతాయన్నారు. సుమారు 600 మంది వీటిలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ సిస్టర్ హెలెన్, ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్ రెడ్డి, సవేరి, ఆచార్య సురేష్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆగస్టు 12న దళిత నాయకుల సమావేశం

నెహ్రూనగర్: దళితులపై జరుగుతున్న దాడులు ఖండించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు ఆగస్టు 12న విజయవాడలో అన్ని దళిత సంఘాల నాయకులతో, పార్టీలతో సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేయనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు చార్వాక, మల్లెల వెంకట్రావు, జాన్‌పాల్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. తమకు ఆన్‌లైన్‌లో యాప్‌లు ఎక్కువగా చేయమని, విధులు కేటాయించారని, వాటి ద్వారా తాము ఇబ్బందులు పడుతున్నామని, వాటిని తగ్గించాలని కోరారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

రైతు దీక్ష భగ్నం

గుంటూరు వెస్ట్: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని గత 20 రోజుల నుంచి స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్ష చేస్తున్న నల్లమడ రైతు సంఘం నాయకులతోపాటు ఇతర సంఘాల నాయకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసారు. దీంతోపాటు వారి టెంట్‌ను కూడా తీసేసారు. ఈ క్రమంలో ప్రతిఘటించిన రైతు సంఘం నాయకులను పోలీసులు శాంతియుత ధోరణిలో అరెస్ట్ చేశారు. నిరసన దీక్షలో ఉన్న కొందరు మహిళలు తీవ్రంగా ప్రతిఘటించారు. వారిని మహిళా పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అర్చకుల వేతనం పెంపునకు కృషి

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈఓలు, అర్చకులు, సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అర్చకులకు రైతు భరోసా కింద వచ్చే ప్రతిఫలాన్ని అందేలా చూడాలన్నారు. అన్యాక్రాంత భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్చకులకు కనీస వేతనం పెరిగేలా చూడాలన్నారు. రూ. 5వేలు జీతం వచ్చేవారికి రూ. 10వేలు, రూ. 10వేలు జీతం వచ్చేవారికి రూ. 15వేలకు జీతాలు పెంచాలన్నారు. అర్హులైన అర్చకులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీ పథకంలో, దేవదాయ శాఖకు చెందిన భూముల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేయాలన్నారు. భూముల వివరాలు సర్వే నంబర్లతో సహా వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, ఆర్.రమణమ్మ, ఈఓలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు

- తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- 13, 55 డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి

పట్నంబజారు: పేదవర్గాలకు అర్హతే ప్రామాణికంగా అన్ని రకాల సేవలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలో 13, 55 డివిజన్‌లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీలతో కలిసి దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఒక్కరూపాయి ఖర్చు లేకుండా, నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కుల, మత ప్రాంత పార్టీల కతీతంగా, సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంట అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. పాలన అంటే ఎలా ఉండాలో సీఎం జగన్ తన పాలన ద్వారా చూపించారన్నారు. ప్రతి గడప ముందుకు ప్రభుత్వ పథకాలను నేరుగా తీసుకెళ్లి తాను ప్రజల మనిషినని స్పష్టం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ మహిళ నేత నూరిఫాతిమా, అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, పి.వెంకటకృష్ణ, పీఎంటహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, అంబేడ్కర్, కనకదుర్గ, ఆబిద్‌బాషా, అజయ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలి

- లేకుంటే చర్యలు తప్పవు
- నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను పరిశీలించిన నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్లాన్ కాపీలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం చేయాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నవభారత్ నగర్, జేకేసీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్‌టీపీలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా చూడాలని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్ గోవర్ధన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ ప్రొఫెసర్‌కు రూ.20 లక్షల సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్



గ్రాంట్ సాధించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్ అండ్ ఫార్మాస్యూటికల్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌కి న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.20.14 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వర్శిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ''మోనిటరింగ్ అండ్ మ్యాపింగ్ ఆఫ్ మైక్రో ప్లాస్టిక్ కంటామినేషన్ ఇన్ చిలికా లేక్ ఎకోసిస్టమ్ ఒడిశా, ఇండియా'' అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడేళ్లకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్ గ్రాంట్ సాధించిన ప్రొఫెసర్ కె.శ్రీకాంత్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన



బాల్య వివాహాల దుష్పరిణామాలను వివరిస్తున్న జిల్లా అధికారి విజయ్‌కుమార్

గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్టప్రకారం నేరమని, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. సచివాలయ మహిళా పోలీసు సుగుణకుమారి విద్యార్థులకు బాల్యం, మానసిక పరిపక్వత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్స్, స్కూల్ సిబ్బంది, డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అప్పాపురం' తూటికాడ తొలగింపు



అప్పాపురం చానల్‌లోని తూడికాడ తొలగింపు పనులు

చేబ్రోలు: ఖరీఫ్ సీజన్‌లో కాలువల్లో సాగునీటి పారుదలకు సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచనల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు సోమవారం చేపట్టారు. చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాలకు సాగునీరు అందించే అప్పాపురం చానల్‌లో తూటికాడ పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. అధిక వర్షాల సమయంలో తుంగ, తూటికాడ అడ్డుపడి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. స్థానిక రైతులు విషయాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దృష్టికి తీసుకువెళ్లటంతో యుద్ధప్రాతిపదికన తూటికాడ తొలగింపు పనులను యంత్రాలతో చేపట్టారు.

రోటరీ క్లబ్‌చే వైద్యవిద్యార్థులకు రూ.40 వేల సాయం



నగదును అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

తెనాలి: రోటరీ క్లబ్ తెనాలి సేవలు శ్లాఘనీయమని రోటరీ క్లబ్ (నెం.3150) అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో మంగళవారం వైద్యవిద్యార్థులకు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. క్లబ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రోటరీ క్లబ్ సేవల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. రోటరీ సేవల్లో తన వంతు సాయం అందిస్తానని గణేష్ యూత్ వీరవల్లి మురళి చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన రూరల్ మండల గ్రామం అంగల కుదురులో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షబీనాకు రూ.50 వేల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. వైద్యవిద్యార్థులు నిడుముక్కల మహేష్, మౌనిలకు ఆర్థికసాయం అందించిన కె.సుబ్రహ్మణ్యం, క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, జెట్టి శివరామకృష్ణప్రసాద్, ఈదర వెంకట పూర్ణచంద్, జీవీ నారాయణ, ప్రవీణ్, ఆలపాటి కిరణ్, నాగభూషణం పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన అద్భుతం

- విద్య, వైద్యరంగంలో రాష్ట్రం ముందంజ
- కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులతో ముచ్చటిస్తున్న అంబటి రాయుడు

పాత గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యా, వైద్యరంగంలో ఎన్నో అద్భుతాలు జరిగి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. మంగళవారం ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని ఆయన సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకమండలి చైర్మన్ నిడమానూరి సురేష్, సభ్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబటి రాయుడు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కోరుతూ అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. సీఎం ఆదేశానుసారం రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై దృష్టి సారిస్తానన్నారు. రాష్ట్రంలో నాలుగు క్రికెట్ అకాడమీలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల్లోకి వస్తున్నానని అన్నారు. సొంత జిల్లా కావడంతో అన్ని ప్రాంతాల్లో పర్యటనలు చేస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం కూరగాయల మార్కెట్లో పర్యటించి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఆలయ సభ్యులు కనమర్లపూడి మారుతి శివ వెంకట సుబ్బారావు, దేవరశెట్టి సురేష్ బాబు, బైసాని ఇందుమతి, కొలిశెట్టి రమాదేవి పాల్గొన్నారు.

గుంటూరు మార్కెట్‌లో సందడి...

పట్నంబజారు: నగరంలోని మార్కెట్ ప్రాంతంలో ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు మంగళవారం సందడి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షేక్ నూరిఫాతిమాతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న వ్యాపారులతో మాటామంతీ కలిపారు. సరదాగా వారితో ముచ్చటించి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి చిరు వ్యాపారులతో చర్చించారు.

అన్నీ వలంటీర్లే చేసి పెడుతున్నారయ్యా..

మార్కెట్ ప్రాంతంలో పర్యటించిన అంబటి రాయుడితో చిరు వ్యాపారులు వారి మనోభావాలు పంచుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తమ జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఉద్వేగభరితంగా చెప్పుకొచ్చారు. కనీసం సంతకం కూడా పెట్టడం రాని మాకు.. వలంటీర్లు అన్ని విషయాన్ని కూలకుషంగా వివరించి.. ఆఖరికి బ్యాంకుల్లో అకౌంట్లు కూడా తెరిపించి.. ప్రతి పథకం అందేలా చూస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా మా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని.. గతంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. ఏ పని ఉన్నా.. రోజుల వ్యవధిలో జరిగిపోతోందని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతో నమ్మకం..

మార్కెట్‌లో పర్యటన అనంతరం అంబటి రాయుడు మీడియాతో మాట్లాడారు. తాను చిరు వ్యాపారులతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకోవటం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటోందని సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరువ్యాపారులకు అందించిన రుణాలు, వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయటంతో పాటు, తమ కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయని చెప్పారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

జారిపడి వృద్ధుడి మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బాత్రూంలో వృద్ధుడు జారిపడి.. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన కూనిశెట్టి వెంకటేశ్వర్లు (75) 16న ఇంటిలోని బాత్రూంలో కాలుజారి పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని గుంటూరులోని వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మరణించాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాం శివారున ఉన్న రైల్వే క్వార్టర్స్ ఆవరణలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచార మిచ్చారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిఉన్నట్లు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి దుస్తులు లేవు. మృతి చెంది వారం రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు స్థానికులను విచారించగా రైల్వే స్టేషన్ పరిసరాల్లో యాచిస్తూ జీవించేవాడని తెలిసింది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

పంపు హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: పట్టణ వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలోని తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణంలో ఉన్న రా వాటర్ పంప్ హౌస్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్ పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, బొంతు నాగిరెడ్డి, బేతపూడి నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. మంగళవారం నగరంలోని ఆటోనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నియోజకవర్గ ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ప్యూన్‌లను ఆగస్టు 1వ తేదీ నుంచి తప్పనిసరిగా నియమించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల విద్యాశాఖ అధికారులు ఎస్.బాబు, కాజ శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన శిక్షలు

తెనాలిరూరల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం, నష్ట పరచడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశముందని తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణ తెలిపారు. రైల్వే రూల్స్, రైళ్ల మీద రాళ్లతో దాడి చేడం, లెవల్‌క్రాసింగ్ వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి రైల్వే అధికారులతో కలిసి మంగళవారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. తెనాలి మోరిస్‌పేటలోని రేపల్లె గేటు వద్ద ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఆస్తులను నష్టం కలిగించూడదన్నారు. ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడతాయన్నారు. రైల్వే శిక్షాస్మృతి గురించి వివరించారు. ఆయన వెంట ఆపరేషన్ సేఫ్టీ కౌన్సెలర్‌ఎంవీఎస్ గురునాథ్, ఇంజినీరింగ్ సేఫ్టీ కౌన్సెలర్ జి. హరినారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. కొల్లిపర వద్ద ఇసుక అక్రమంగా తరలుతోందన్న సమాచారంతో తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు లారీలకు ఎటువంటి అనుమతులు లేకుండ ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి మార్కెట్ ఏరియాలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

వాటర్‌ట్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



గుంటూరు రూరల్: చిన్న పలకలూరు గ్రామంలో తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు మండల వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు మంగళవారం స్థల పరిశీలన చేశారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు గ్రామ ప్రజల తాగునీటి సమస్యను తహసీల్దారుకు వివరించారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. దీంతో స్థల పరిశీలన చేపట్టినట్లు తహసీల్దారు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

వందశాతం సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 43, 33 డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: అర్హులైన లబ్ధిదారులందరికీ వంద శాతం సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతున్నట్లు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 43, 33వ డివిజన్లలో సుగాలీకాలనీ, అశోక్‌నగర్‌లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు 99 శాతం మేరకు అర్హులైనవారందరికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన ఒక్క శాతం లబ్ధిదారులకు సైతం న్యాయం చేస్తూ 100 శాతం సంక్షేమం అందించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. చిన్న, చిన్న సాంకేతిక కారణాలతో పథకాల లబ్ధి అందని వారు ఎవరైనా ఉంటే, వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందించి, వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, కార్పొరేటర్లు గోపి శ్రీనివాసరావు, యక్కలూరి మారుతి కోటిలింగారెడ్డి గారు, వైఎస్సార్ సీపీ నాయకులు కరుణాకర్ రెడ్డి, పలుస రాజేష్, బక్కా ఉదయ్, సంగా రవీంద్ర, ఇరుమురి లక్ష్మీనరసారెడ్డి, ఇన్నారెడ్డి, అలదాసు శివ, పరసా బుజ్జి, వేముల చంద్రశేఖర్, ఇమ్మడి రాజేష్, నవీన్, నగరపాలకసంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.